క్లుప్తంగా

విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు అభినందనీయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నిరంతర విద్యుత్ సరఫరాలో విద్యుత్ శాఖ అధికారుల పనితీరు అభినందనీయమని ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వాసుదేవ్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నా.. నిరంతరం పని చేశారని కొనియాడారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్


బాధ్యతలు స్వీకరిస్తున్న రామ్మోహన్‌రావు

రెబ్బెన: రెబ్బెన మండల తహసీల్దార్‌గా రామ్మోహన్‌రావు శుక్రవారం బాధ్యతు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ జ్యోత్స్న మంచిర్యాలకు బదిలీ కాగా ఆమె స్థానంలో పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో విధులు నిర్వర్తించిన రామ్మోహన్‌రావును రెబ్బెనకు బదిలీ అయ్యారు. ఆయనను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఘనంగా బోనాలు


బోనాలతో చిన్నారులు

రెబ్బెన: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలు నేటి తరం విద్యార్థులకు తెలియాలనే ఉద్దేశంతో బోనాల పండుగు నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా పోతరాజు వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ హనూక్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తున్నామని, విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం పలువురిని ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ భుజంగరావ్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు పంపిణీ చేశారు. భవిషత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందడమే కాకుండా సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఉదయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ ప్రారంభం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'విద్యాధన్ ట్రస్ట్' వారి ఆధ్వర్యంలో రెండు ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థులకు శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో ఆర్వో ప్లాంట్లను వితరణ చేసినట్లు ట్రస్ట్ ఆర్గనైజర్ సతీష్ తెలిపారు. విద్యార్థులు కలుషిత నీరు తాగి అనారోగ్యం బారిన పడకుండా ఆర్వో ప్లాంట్‌లను వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, సిబ్బంది చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

నరక ప్రయాణం..!

- గుంతలమయంగా ఘాట్‌రోడ్డు
- నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


చెట్లు విరగడంతో నిలిచిన రాకపోకలు


ప్రమాదకరంగా మూలమలుపులు

జైనూర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఘాట్ రోడ్డు ఇరువైపులా చిత్తడిగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అసలే ఘాట్ రోడ్డు, ప్రమాదకర మలుపులు, ఇరుకు రహదారి, అడుగుకో గుంత, రాళ్ల తేలిన రహదారి. ఇది జిల్లాలోని ప్రధాన రహదారి దుస్థితి. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి ప్రయాణించాలంటే నరకయాతన పడాలి. కెరిమెరి ఘాట్ వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో గంటల తరబడి రాకపోకలు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

తొమ్మిది కిలోమీటర్లు 37 మలుపులు..

మండలంలోని కెరిమెరి ఘాట్‌లోని మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో మూల ములుపులు ముందు నుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రహదారికి ఇరువైపులా.. చిత్తడిగా ఉండడంతో రాహదారి దిగాలంటే వాహనం అదుపుతప్పే ప్రమాదం ఉంది. మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు, హెచ్చరికలు, వేగనిరోధకాలు లేక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

కొత్త వారికి చిక్కులే..

ఘాట్‌రోడ్డులో ఏర్పడిన గుంతలతో నీరు నిల్వ ఉండడంతో అటుగా మొదటిసారి వెళ్తున్న ప్రయాణికులు గుంత ఎంత లోతులో ఉందో తెలియక ప్రమాదానికి గురై అయ్యే అవాకాశాలు ఉన్నాయి. ఒక వాహనం మరో వాహనాన్ని దాటే సమయంలో రహదారి ఇరుకుగా ఉండడంతో తరుచు గొడవలు జరుగుతున్నాయి. గంటల తరబడి వాహనాల రాకపోకలు నిలిచి ఇబ్బంది పడుతున్నారు. భారీ వాహనాలు నడుస్తుండడంతో రహదారిగా గుంతలమయంగా మారుతుందని మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్లు విరగడంతో రాకపోకలు బంద్..

గత కొన్ని రోజులుగా ముసురు కురుస్తుండటంతో బుధవారం ఉదయం ఘాట్‌లోని చెట్లు విరిగిపడడంతో గంటల తరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అటుగా వెళ్తున్న ఆర్టీసీ, లారీ డ్రైవర్‌లు చెట్లను తొలగించారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ ప్రయాణం



మండలంలోని జామిని గ్రామం నుంచి ప్రతీ రోజు కెరిమెరి మండల కేంద్రానికి వెళ్లి పాలు పోయాలంటే ఏ సమయంలో ఎలాంటి ఆపద వస్తుందోనని బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నాను. రోడ్డు మొత్తం గుంతలమంగా మారింది. అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– గుగ్గే ఉమేశ్, పాల వ్యాపారి

రైతులకు పరిహారం అందించాలి


కూరగాయలు పంపిణీ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ

బెజ్జూర్: పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని బెజ్జూర్ మాజీ జెడ్పీటీసీ, బీజేపీ నాయకులు పాల్వాయి సుధాకర్ రావు డిమాండ్ చేశారు. మండలంలోని తలాయి, తిక్కపల్లి, భీమారం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్న విషయం తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు నిత్యావసర సరుకులు అందించాలని ఆదేశించారు. శనివారం ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించి దాదాపు 150 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఎకరానికి రూ.25 వేల పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. అనంతరం నీట మునిగిన పొలాలను పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, నాయకులు సామల తిరుపతి, మెస్రం రాజారాం, రామయ్య, చంటి, రమేశ్, జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

జైనూర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ప్రత్యేకాధికారి మధుకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ రావులు అన్నారు. శనివారం మండలంలోని శివనూర్ గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మురుగు కాలువల్లో దోమల మందు పిచికారీ చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఆయన వెంట నాయకులు రాథోడ్ సందీప్, రాహుల్, తదితరులు ఉన్నారు.

వరదనీటికి దెబ్బతిన్న పత్తిపంట


మురళీగూడలో దెబ్బతిన్న పత్తి పంట

పెంచికల్‌పేట్: పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత, పెద్దవాగుకు వరద పోటెత్తడంతో మురళీగూడ, జిల్లెడ, నందిగామ గ్రామాల్లో 500 ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. గత నాలుగు రోజులుగా వరద నీటిలో మునిగిన పత్తి పంట వరద తగ్గడంతో బయట పడింది. వరద ప్రవాహంతో పంట పూర్తిగా దెబ్బతింది. వందల ఎకరాల్లో పంటలు నీట మునిగినా.. ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు నీటి పాలు కావడంతో కన్నీరుమున్నీరు అవుతున్నారు. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వర్షంతో వ్యవసాయ పనులకు ఆటంకం


ఉప్పొంగి ప్రవహిస్తున్న ప్రాణహిత నది

కౌటాల: మండలంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. గత వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. అలాగే విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద గల ప్రాణహిత నది వరదనీటితో పరవళ్లు తొక్కుతుంది. తుమ్మిడిహెట్టి సమీపంలోని ప్రాణహిత నది, తాటిపెల్లి వద్ద వార్థా నది, గుండాయిపేట గ్రామానికి సరిహద్దులోని పెన్‌గంగ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గంగపుత్రులు చేపల వేటను నిలిపివేశారు. అలాగే వార్ధా, పెన్‌గంగా నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో మహారాష్ట్రకు నాటు పడవల రాకపోకలు నిలిచిపోయాయి. సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఎస్సీకాలనీలో లోపించిన పారిశుధ్యం


ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన వరద నీరు

వాంకిడి: మండలంలోని ఖమాన ఎస్సీ కాలనీలో పారిశుధ్యం లోపించింది. సరైన డ్రెయినేజీ లేక పోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు వృద్ధిచెంది అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చస్తున్నారు. రోడ్డుపై కాలినడకన వెళ్లలేని పరిస్థితి దాపురించిందని, పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బీటీరోడ్డు లేక అవస్థలు


బురదరోడ్డుపై చిన్నారుల ఇక్కట్లు

లింగాపూర్: మండలంలోని పిక్లాతండా నుంచి కోత్తపల్లి వరకు బీటీరోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రం నుంచి పిక్లాతండా వరకు బీటీరోడ్డు ఉన్నా.. కోత్తపల్లి నుంచి పిక్లాతండా వరకు విద్యార్థుల రాకపోకలు సాగించాలంటే బురదలోనుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే మండలంలోని జాముల్‌ధరా నుంచి కిమానాయక్‌తండా, పూల్‌సింగ్‌తండా, వంగిడిమాదురా వరకు రోడ్డు సరిగా లేక పోవడంతో ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు.

విద్యుత్‌షాక్‌తో వృద్ధురాలు మృతి

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని నౌగాంబస్తీకి చెందిన పూదరి రాజమణి (66) శనివారం రాత్రి విద్యుత్‌షాక్ గురై మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో ఉన్న కూలర్‌పై బట్టలు తీసివేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు.

సామర్థ్యాల సాధన కోసం కృషి చేయాలి



శిక్షణ ఇస్తున్న ఎస్‌వో శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన గణితం, సైన్స్, సోషల్ ఉన్నత పాఠశాలల రిసోర్స్ పర్సన్లకు నిర్వహించిన నేషనల్ అచీవ్ మెంట్ సర్వే (ఎన్ఏఎస్)శిక్షణ కార్యక్రమం ముగిసింది. శిక్షణ ద్వారా తెలుసుకున్న అంశలను పాఠశాలలోని పిల్లలకు అందించి కనీస సామర్థ్యాలు పెంచాలన్నారు. జిల్లా కేంద్రంలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్ తమ మండలంలోని స్కూల్ కాంప్లెక్స్‌లో ఈ నెల 31 నుంచి ఆగస్టు 4వరకు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుభాష్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో పునర్జన్మ


అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేయడం వలన ఒక మనిషికి పునర్జన్మ ఇచ్చిన వారమవుతామని ఆడ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వినోద్ అన్నారు. జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలన్నారు. 18 సెకన్లకు 30 సార్లు కంప్రెషర్ చేయాలని, 2 సార్లు బ్రీతింగ్ అందించాలన్నారు. అనంతరం హార్ట్‌ఎటాక్, కార్డియా అరెస్టు గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రశాంత్, శ్రీకాంత్, పలువురు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కాగజ్‌నగర్ రూరల్: పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు బకాయి ఉన్న పీఎఫ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు శనివారం పట్టణంలోని సర్‌సిల్క్ జగ్జీవన్‌రాం చౌరస్తాలో నిరసన తెలిపారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేసి సమస్యను జఠిలం చేయవద్దన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికు ల యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సంజీవ్, గౌరవ అధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్, వెలిశాల కృష్ణమాచారి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కౌటాల: సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం మండల నాయకులు లాలాజీ అన్నారు. సమగ్ర శిక్షలోని ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కౌటాల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్షలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీవిత బీమా రూ. 10 లక్షలు, ఆరోగ్య బీమా రూ. 5 లక్షలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో పవిత్ర, సీఆర్పీలు ప్రకాశ్, మహేశ్, దేవన్న, లాలాజీ, రవికుమార్, బానయ్య పాల్గొన్నారు.

శ్రీనివాస్ సేవలు అభినందనీయం


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కాగజ్‌నగర్ రూరల్: విద్యార్థుల్లో భాషా సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు శ్రీనివాస్ చేసిన సేవలు అభినందనీయమని నవోదయ విద్యాలయం అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి అన్నారు. పట్టణంలోని జహవర్ నవోదయ విద్యాలయంలో టీజీటీ తెలుగు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న తులసి శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం మాట్లాడారు. నవోదయ విద్యాలయంలో దాదాపు 37 సంవత్సరాల పాటు తెలుగు భాష బోధన చేసి వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభావతి మాట్లాడుతూ విద్యార్థులు ప్రగతి పథంలో పయనించడానికి శ్రీనివాస్ అందించిన ప్రోత్సాహం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ హిందీ ఉపాధ్యాయులు రామయ్య, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ చక్రపాణికి సన్మానం

నవోదయ విద్యాలయ సమితి పూణే రీజియన్ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్తున్న నవోదయ ప్రిన్సిపాల్ చక్రపాణిని శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చక్రపాణి మాట్లాడుతూ కాగజ్‌నగర్ విద్యాలయంలో పనిచేయడం సంతృప్తినిచ్చిందన్నారు. మళ్లీ అవకాశం వస్తే ఈ ప్రాంతంలో పనిచేస్తానని తెలిపారు.

హైదరాబాద్‌కు బస్సు ప్రారంభం

కౌటాల: కౌటాల మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ నూతన బస్సు సర్వీసును ప్రారంభించినట్లు ఆర్టీసీ డీఎం విశ్వనాథ్ శనివారం తెలిపారు. కౌటాల బస్టాండ్ నుంచి ప్రతీరోజు సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌కు డీలక్స్ సర్వీసు బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. కౌటాల నుంచి హైదరాబాద్‌కు గతంలో మాదిరి సూపర్ లగ్జరీ సర్వీసు రాత్రి 8 గంటలకు ఉంటుందన్నారు. ప్రతీరోజు కౌటాల –హైదరాబాద్‌కు రెండు బస్సు సర్వీసులు ఉంటాయని, చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బీడీ కార్మికులకు జీవనభృతిని స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న వెంకట్ నారాయణ

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు ఆగస్టు నుంచి జీవనభృతిని అందించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా నాయకులు వెంకట్ నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. బీడీ కార్మికులందరికీ చేయూత పథకం కింద రూ.4 వేల జీవనభృతి ఇస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి, గద్దెనెక్కి ఆరు నెలలు గడిచినా పథకాన్ని అమలు చేయలేదన్నారు.మంత్రి సీతక్క ఆగస్టు నుంచి జీవనభృతి ఇస్తామని ప్రకటించారని, దీనిని తమ యూనియన్ స్వాగతిస్తోందన్నారు. ఇందులో నాయకులు గౌరాల సుభాష్, దుర్గం కళావతి, గంగమ్మ, తారాబాయి, తౌఫీక్ పాల్గొన్నారు.

అక్రమాలు అరికట్టేందుకే సామాజిక తనిఖీ


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీవో కుటుంబరావు

తలమడుగు: ఉపాధిహామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకే ప్రతీ సంవత్సరం సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని అడిషనల్ డీఆర్‌డీవో కుటుంబరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో సామాజిక తనిఖీ నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2024 వరకు మండలంలోని 28 గ్రామ పంచాయతీలో రూ. 2 కోట్ల 2 లక్షల 12 వేల నిధులు పనుల కోసం వినియోగించడం జరిగిందన్నారు. పని ప్రదేశాల్లో పనులను పరిశీలించి కూలీల వివరాలను తెలుసుకోవడం జరిగిందన్నారు. కొన్ని గ్రామాల్లో ఉపాధిహామీ సిబ్బంది నిధులను దుర్వినియోగం చేసినట్లు వెలుగులోకి వచ్చాయన్నారు. నిధులు దుర్వినియోగం చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకో వడం జరుగుతుందన్నారు. ఏపీవో కృష్ణారావు, శ్రీనివాస్, ఎంపీడీవో చంద్రశేఖర్, రమాకాంత్, ఏపీవో మేఘమాల, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తాం


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సిరికొండ: మండలంలోని సమస్యలు పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని బీజేపీ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్ మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలకు బీటీరోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు, జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతతూ.. తీర్మానం చేశారు.